క్లుప్తంగా

నేడు సావిత్రిబాయి పూలే వర్ధంతి

రాజేంద్రనగర్: సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రఘుగౌడ్, ప్రధాన కార్యదర్శి బి.సిద్ధేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ఆవరణలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుల సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం

శంషాబాద్: మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నివాస ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన మెకానిక్ షెడ్డులో ఉన్న ఓ బస్సులో ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నాయి. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలకు దట్టమైన పొగలు వ్యాపించాయి. వెంటనే మంటలను ఆర్పివేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అక్రమంగా షెడ్డు ఏర్పాటు చేసిన సదరు వ్యక్తులు అగ్నిప్రమాదం జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఉమామహేశ్వరిరెడ్డి

రాజేంద్రనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జనహిత వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. జనహిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేశారు. పది మందికి ఆరు నెలలకు సరిపడా సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు జనహిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేయూత అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి తమ వంతు బాధ్యతగా ప్రతినెలా నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అపర్ణారెడ్డి, ఎం.వనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలోని బోధన మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడీపీఏ) ముంబాయి సహకారంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, ఇతరులకు డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు పేర్ల రిజిస్ట్రేషన్‌ను మార్చి 12వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నిర్మాత, వర్క్‌షాప్ కన్వీనర్ మహ్మద్ ముజాహిద్‌ను ఫోన్ నెంబర్ 9885389140లో సంప్రదించాలన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 'హ్యాపీ విమెన్.. హ్యాపీ ఫ్యామిలీ' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ హైదరాబాద్‌కు చెందిన బికె.లక్ష్మీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

నేటి నుంచి దివ్యాంగుల బస్‌పాస్‌ల మేళా

రాయదుర్గం: గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో దివ్యాంగుల సౌకర్యార్థం 'దివ్యాంగుల బస్‌పాస్‌ల స్పెషల్ మేళా'ను నిర్వహించడం జరుగుతుందని టీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారన్నారు. బస్‌పాస్ పొందటానికి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ కాపీ, ఆధార్‌కార్డు, ఐడీకార్డు తీసుకు రావాలని, సర్వీస్‌చార్జీ కిందరూ.50ల రుసుముతో సంప్రదించాలన్నారు. శుక్రవారం (10వ తేదీ) పటాన్‌చెరు బస్ పాస్ కేంద్రం, సోమవారం (13వ తేదీ) దిల్‌సుఖ్‌నగర్, బుధవారం (15వ తేదీ) ఇబ్రహీంపట్నం, శుక్రవారం(17వ తేదీ) మెహిదీపట్నం, సోమవారం(20)వ తేదీ సీబీఎస్‌లోని బస్ పాస్ కేంద్రంలో మేళా జరుగుతుందన్నారు.

ప్రధాన రోడ్లు చెత్తమయం

మాదాపూర్: అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా ఉన్న హైటెక్ సిటీ మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ప్రధాన రోడ్లన్నీ చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఈ ఏరియాను విదేశీ ప్రతినిధులు సైతం సందర్శిస్తుంటారు. స్వచ్ఛ హైదరాబాద్ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా ఫలితం లేదు. మాదాపూర్‌లోని సర్వే ఆఫ్ ఇండియా, చందానాయక్ తండా, సాయినగర్, అయ్యప్పసొసైటీ, 100 అడుగుల రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో ఆ రోడ్ల గుండా ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రధానంగా రోడ్ల పక్కన చిరు వ్యాపారులు వ్యర్థాలను వేయడంతో పేరుకుపోతున్నాయి.
- వివాహాది శుభకార్యాలలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోడ్ల పక్కన పారబోస్తుండడంతో కుక్కలు వస్తున్నాయి.



మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

- తడి, పొడి చెత్తను ఒకేచోట వేయడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులు వీచినప్పుడు చెత్త ఎగిరి వాహనాలపై పడుతోందని వాహనదారులు వాపోతున్నారు.
- రోడ్లపై చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- చిరు వ్యాపారులు, మాంసాహార షాపుల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని స్థానికులు అంటున్నారు.
- రోడ్లపై, బహిరంగ ప్రదేశాలపై చెత్త వేసిన వారికి జరిమానా విధించాలని పేర్కొంటున్నారు.
- అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీనియర్ సిటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మాదాపూర్‌లోని సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు



చందానాయక్ తండా వద్ద ..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నారాయణరెడ్డిని గెలిపించండి

మణికొండ: ఈ నెల 13న జరగనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎ.వెంకట నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వెంకట నారాయణరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, దానికి నాందిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులైన ఉపాధ్యాయులు నారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. అనేక ఉపాధ్యాయ సంఘాలు తమకు మద్దతు ఇవ్వడం మంచి పరిణామమని, అత్యధిక మెజార్టీతో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గెలుపొందుతాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు బీరప్ప, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నరేందర్‌రెడ్డి

ఆల్‌కాలనీస్ రెసిడెన్స్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న కాలనీ సంఘాల నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌కాలనీస్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల కార్యక్రమం మొదలైంది. మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఎన్నికల అధికారులు నామినేషన్ పత్రాలు తీసుకుంటున్నారు. మొదటి రోజు ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శులు తదితర పదవులకు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం సైతం నామినేషన్లు స్వీకరిస్తామని, శనివారం ఉపసంహరణ, ఆదివారం ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం క్వార్టర్స్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయం, మైహోం అవతార్ సమీపంలోని సంకట హరణ హనుమాన్ దేవాలయాల్లో ప్రతిష్టాపన పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అంకురార్పన, మండపారాధన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం, క్షీరాధివాసం, హోమాలు నిర్వహించారు. మణికొండ క్వార్టర్స్ దేవాలయంలో మాజీ సర్పంచ్ కొండకళ్ల భిక్షపతిరెడ్డి కుమారులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి అందించిన ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేస్తున్నారు. మైహోం అవతార్ సమీపంలోని ఆలయంలో శనివారం నవగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నారు. గురువారం ప్రారంభమైన ప్రతిష్టాపన పూజలు శనివారం వరకు కొనసాగుతాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అర్చకులు కోరారు. దేవాలయాల వద్ద ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు.



విఘ్నేశ్వర పూజతో ప్రతిష్టాపన పూజలు ప్రారంభించిన అర్చకులు



మణికొండ క్వార్టర్స్ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

శంషాబాద్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం టీయూడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్తలు రాస్తున్న క్రమంలో జర్నలిస్టులు దాడులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని, జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే అందజేయాలని కోరారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి జర్నలిస్టులు కష్టపడ్డారని, వారిని ఫ్రంట్‌లైన్ వారియర్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజేఎఫ్ పోరాడుతుందని వారు పేర్కొన్నారు.

కమిటీ సభ్యుల నియామకం

టీయూడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా కె.సుదర్శన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాస్, భిక్షపతి, సహాయ కార్యదర్శులుగా పి.మాధవచారి, కె.యాదయ్య, కోశాధికారిగా ఎ.భానుగౌడ్, కమిటీ సభ్యులుగా ఎం.శ్రీనివాస్, మహేందర్, రవి, జ్ఞానేశ్వర్, రామకృష్ణ, ప్రసాద్, గోపాల్, యాదగిరి ఎన్నికయ్యారు.



సమావేశంలో పాల్గొన్న దేవేందర్, సత్యనారాయణ తదితరులు

రోడ్డుపై బోర్‌వెల్‌తో స్థానికులకు ఇబ్బందులు

రాజేంద్రనగర్: ప్రధాన రహదారులపై బోర్లు వేసి వదిలేయడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ బృందావన్ కాలనీ పరిధిలోని స్ట్రీట్ నెంబర్–4లోని ప్రధాన రహదారిపై బోర్ వేయడం వల్ల తమకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బస్తీ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీవో, తహసీల్దార్, సర్కిల్ ఉప కమిషనర్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బోర్ వేయించిన వ్యక్తి పోలీస్ విభాగంలో పని చేస్తుండడంతో బెదిరింపులకు దిగుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కాలనీలో సీసీ రోడ్డు వేసేందుకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులు ప్రారంభించారని, బోర్ సమస్యను పరిష్కరించిన తర్వాతే రోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.



బృందావన్ కాలనీలో రోడ్డుపై వేసిన బోర్‌వెల్

నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన కారుకు నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలతో మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గండిగూడకు చెందిన కె.దర్శన్, లక్ష్మీ దంపతులు 04, జూలై 2021న బైక్‌పై వెళ్తూ వారి గ్రామంలోని రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న సమయంలో కారు ఢీకొనడంతో ఇద్దరూ మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులు కారు డ్రైవర్ మల్లికార్జున్‌రెడ్డిపై ఫిర్యాదు చేయగా.. తన కారుకు ఇన్సూరెన్స్ ఉందని నష్టపరిహారం వస్తుందని నమ్మించాడు. నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు ఉన్నట్లు కోర్టులో తేలడంతో బాధితులు మల్లికార్జున్‌రెడ్డిపై పోలీసు కేసు పెడతామని హెచ్చరించారు. దీంతో వారికి రూ.5,50,000 ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే అప్పటి నుంచి అతడు స్పందించకపోవడంతో బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ సంస్కృతి ఎంతో గొప్పది

గోల్కొండ: హిందూ పండగల ఉత్సవాలు ఎంతో గొప్పవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డలోని మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కల్యాణ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఆయన వెంట నామ యాదగిరి, సుధాకర్‌యాదవ్, శంకర్‌యాదవ్ తదితరులున్నారు.

మజ్లిస్ పార్టీ ప్రజా సేవకే అంకితం

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజా సేవకే అంకితమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఆయనకు వివరించారు. మజ్లిస్ సీనియర్ నాయకుడు శివశంకర్‌తో పాటు హబీబ్ చావూస్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ కన్వెన్షన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో పలు రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలకు సన్మానం చేశారు. మహిళా కౌన్సిలర్‌లతో పాటు మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భాగ్యలక్ష్మి కాలనీలో కౌన్సిలర్ ఎల్.వందనానగేశ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు దేవరాజుల నాయుడు, రాజలింగం, రాంచందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద గోల్కొండలో..

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్ద గోల్కొండలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ మహిళా సిబ్బంది, మహిళా వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందిని సర్పంచ్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వరూప, వార్డు సభ్యులు శ్రావణి, మానెమ్మ, సాయిలమ్మ, అమృత, యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఏఎన్ఎం సురేఖ, పద్మ, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి



మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలో వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్, మహిళలు



మహిళలను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మయ్య

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

రాజేంద్రనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ ద్వారా దేశ సంపదను అదానీకి దోచి పెడుతున్నారంటూ గురువారం అత్తాపూర్‌లోని బి–బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తూ ప్రైవేట్ సంస్థలను కట్టబెట్టడం దారుణమన్నారు. అదాని, అంబానీలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రజల విశ్వాసాన్ని అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏ–బ్లాక్ అధ్యక్షుడు నవీన్, సానెం శ్రీనివాస్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, సులోచన, ప్రభాకర్‌రెడ్డి, తాజుద్దీన్, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ సీనియర్ నాయకుడు మృతి

గోల్కొండ: మజ్లిస్ సీనియర్ నాయకుడు గురజాల వేణుగోపాల్‌యాదవ్ (65) మృతి చెందాడు. దశాబ్దాలుగా మజ్లిస్ పార్టీ ఉంటూ క్రమశిక్షణ గల నాయకుడిగా ఆయన పేరుపొందారు. గుండెపోటుతో మృతి చెందిన ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన ఉమ్మడి రాష్ట్ర టెక్నాలజీకల్ కార్పొరేటర్ డైరెక్టర్‌గా పని చేశాడు. కాగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవ్వాలి



మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన హెచ్‌ఎం తాజ్‌బాబు, ఇతర ఉపాధ్యాయులు

గచ్చిబౌలి: అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవ్వాలని ఐవీ ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ భారతీసుధ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ప్రాథమికంగా మహిళలకు ఆరోగ్యం పట్ల ఉండే అపోహలపై , వివిధ రకాల క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. మహిళా నాయకురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కు లభించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉద్యోగులు,మహిళా నాయకురాలు రేణుకమ్మ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు సాంబశివరావు, శ్రీనివాసరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్‌లో..

రాయదుర్గం: రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఉపాధ్యాయులు సుధీర క్రాంతి పావని, కృష్ణవేణి, మమత, కమలమ్మ, దేవమణి, రాజేశ్వరి, సునందినిలను సత్కరించారు. కార్యక్రమంలో అంబర్‌సింగ్, ఆంజనేయులు, అంజలయ్య, పాండు శ్రీనివాస్, బాలయ్య , విద్యార్థులు పాల్గొన్నారు.